క్లుప్తంగా

పాదచారులకు మజ్జిగ పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో వాహన చోదకులకు, పాదచారులకు చల్లటి మంచినీటిని, మజ్జిగను పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావాలని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ జరిగింది. కార్యక్రమానికి కార్పొరేటర్ రాజేష్‌తో పాటు శ్రీశైల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుడు గురుమంతు మహేష్‌లు విచ్చేసి మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో పణుకు ఫణీంద్ర, మజ్జి శ్రీనివాస్, సంఘం రాష్ట్ర కమిటీ, అర్బన్ కమిటీ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ తెలిపారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు ఉచిత ఆయుర్వేదం, అల్లోపతి, హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రముఖ వైద్యులచే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్రభొట్ల, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా రామబ్రహ్మం, ఆయుర్వేద వైద్యనిపుణులు డా. ప్రసాద్ పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 200 మంది వైద్యసేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



గుణదల(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పరిటాల ఓంకార్ కల్యాణ మండపంలో తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా శ్రేణులతో అవినాష్ ఆదివారం సమావేశమయ్యారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పిగొట్టే బాధ్యత సోషల్ మీడియా కన్వీనర్లదేనన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లు రాష్ట్రానికి ఏమి చేయకున్న ప్రచారాలు మాత్రం ఘనంగా చేసుకున్నారని, తాజాగా సెల్ఫీ ఛాలెంజ్‌ల పేరిట డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్‌కు నిజంగా దమ్ముంటే ఒక్కసారి తూర్పు నియోజకవర్గంలో ఏమి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. భవిష్యత్ కార్యాచరణ, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు తదితర అంశాలపై సోషల్ మీడియా కన్వీనర్లతో అవినాష్ చర్చించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేశారని, మొన్నటి ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి వీరి కృషి అమోఘం అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, కార్పొరేటర్, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పగిడిపాటి చైతన్యరెడ్డి, నాయకులు నిడదవోలు ఉదయ్, మచ్చా శ్రీనివాస్ రెడ్డి, తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిల్లి వెంకట్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ ఎస్వీ జానారెడ్డి అన్నారు. మదర్ థెరిసా ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో కండ్రిక ఇన్నర్‌రింగ్‌రోడ్డు కూడలి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రోడ్లపై రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. వేసవికాలంలో బయటకు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండ సమయంలో కాకుండా ఉదయం, సాయంకాలం వేళల్లో మాత్రమే బయటకు రావడం ఉత్తమమన్నారు. ఆటో కార్మికులు ప్రజలకు సేవా చేయాలనే ఆకాంక్షతో ప్రతి ఏటా చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు. ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ రంగారావు, సెక్రటరీ కోటేశ్వరరావు, సభ్యులు మల్లేశ్వరరావు, గోపి, నాని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కంకిపాడు(పెనమలూరు): మహిళా వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.కె.ఎన్.జయలక్ష్మి కోరారు. కృష్ణా జిల్లా కంకిపాడులో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డి.కమలకుమారి, డి.వి.రత్నం, ఎం.సలోమి, కె.పద్మ, ఎం.నాగమణి, ఆర్.రమణ, విమల, వై.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

‘మంచి చేసే ప్రజల వద్దకు వెళ్తున్నాం’

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'
- పవన్ కళ్యాణ్ వారాహి ఎక్కడ ?
- లోకేష్ పాదయాత్ర సెల్ఫీలకే పరిమితం


37వ డివిజన్‌లో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఎమ్మెల్యేలందరూ ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 37వ డివిజన్ 183వ సచివాలయం పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెలంపల్లి ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వం, నేటి జగనన్న పాలన మధ్య తేడాను వివరిస్తూ అభిప్రాయలు సేకరించారు. ఆయా ఇళ్ల యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లను అంటించారు.

సంక్షేమ పథకాలు భేష్..

అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. జగనన్న చేసిన మంచి ప్రజలకు తెలుపుతున్నామని, దానిపై ప్రజల అభిప్రాయాన్ని అడుగుతున్నామన్నారు. ప్రజలు మంచిగా స్పందిస్తూ వారి అభిప్రాయాన్ని తెలుపుతున్నారన్నారు.

నియోజకవర్గంలో చిన్న, చిన్న సమస్యలు మా దృష్టికి వచ్చాయని, వాటిని అక్కడికక్కడే పరిష్కారిస్తున్నామన్నారు. ఎంతో అట్టహాసంగా పవన్‌కళ్యాణ్ తన వారాహి వాహనాన్ని బయటకు తీసుకొచ్చి హడావుడి చేశారని, అది ఇప్పుడు ఎక్కడ ఉంది, ఏమైందని ప్రశ్నించారు. టీడీపీ నేత లోకేష్ పాదయాత్ర సెల్ఫీలకే పరిమితమైందని విమర్శించారు. సెల్ఫీలే నా గోల్ అని పాదయాత్ర చేస్తున్న వ్యక్తి లోకేష్ అన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

నగరాభివృద్ధిపై చర్చకు సవాల్..

అవినీతి అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఎమ్మెల్యే వెలంపల్లి దుయ్యబట్టారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేశ్‌లు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. చంద్రబాబు హయాంలో విజయవాడ నగర అభివృద్ధికి ఏమి చేశారు అనే దానిపై చర్చకు సిద్ధమని అని సవాల్ విసిరారు. తాము చేసిన అభివృద్ధిని చర్చలో వివరిస్తామన్నారు. దీనిపై చంద్రబాబు చర్చకి రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, నాయకులు గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోతీ మస్జీద్‌లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మోతీ మస్జీద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మోతీ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వెలంపల్లి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, హబీబుల్లా, మొహర్రాజ్, చిచ్చా బ్రదర్స్‌లతో పాటు మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు. అతిథులు ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడంతో పాటు ఇఫ్తార్ స్వీకరించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ పెద్దలు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరించారు. మసీదు ఆవరణలో షెడ్డు నిర్మాణానికి వెలంపల్లి ఫౌండేషన్ నుంచి నిధులు వెచ్చించి అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, పిళ్లా సూరిబాబు(జగ్గు), ముస్లింలు పాల్గొన్నారు.

కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్ మనికొండకు చెందిన శ్రీకళాకేంద్రానికి చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై జక్కంపూడి కీర్తి, పెదిరెడ్ల లిఖిత, షాన్విత, వాసవిశ్రీ, అనగాశ్రీ, భవ్యలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రామాలయంలో అన్నసమారాధన

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కృష్ణలంక సబ్‌వే సమీపంలోని రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు సీతారామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జనార్దనరావు మరణం తీరని లోటు


జనార్దనరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నాయకుడు, ఉపాధ్యాయ వాణి పత్రిక మాజీ ప్రధాన సంపాదకుడు, కమ్యూనిస్టు నాయకుడు పోతినేని జనార్దనరావు(95) మరణం ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరని లోటు అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. జనార్దనరావు అనారోగ్యంతో ప్రజాశక్తినగర్‌లోని ఆయన ఇంటిలో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం ఉదయం అవినాష్ సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ నివాళులు అర్పించిన తర్వాత మాట్లాడుతూ జనార్దనరావు ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన తర్వాత ఉపాధ్యాయ సంఘం నిర్వహించే కార్యక్రమాలకు ఆయన పూర్తి సమయం కేటాయించారన్నారు. ఉపాధ్యాయ వాణి పత్రికకు ప్రధాన సంపాదకునిగా పత్రికకు దిశానిర్దేశం చేశారని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొని జనార్దనరావు మృతదేహానికి నివాళులర్పించారు. జనార్దనరావు నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేశారు. అనంతరం కృష్ణలంకలోని శ్మశానవాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వాడవాడలా ఈస్టర్ పర్వదిన వేడుకలు



విద్యుత్ వెలుగులో సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ సెంటనరీ చర్చి


ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ చిన్నప్ప


షాలేము చర్చిలో మాట్లాడుతున్న ఆకుల శ్రీనివాస్‌కుమార్, ఫాదర్ సత్యవేదం


కార్పొరేటర్ మాధురి లావణ్యను ఆశీర్వదిస్తున్న ఫాదర్ చిన్నప్ప

భవానీపురం(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా ఈస్టర్ పర్వదిన వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు తిరిగి జన్మించిన పర్వదినం ఈస్టర్(పునరుత్థానం) పండుగను పురస్కరించుకుని 45వ డివిజన్ పరిధిలోని జోజినగర్‌లో ఉన్న బాలఏసు పుణ్యక్షేత్రంలో వేడుకలు జరిగాయి. జోజినగర్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూజలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్యను ఆయన ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ సమాజంలో ద్వేషం, అసూయ, హింసల కన్నా శాంతి, ప్రేమ, దయ, క్షమా గుణాలు సమున్నతమైనవని నిరూపించేందుకే క్రీస్తు సమాధి నుంచి సజీవులై తిరిగి వచ్చారని పేర్కొన్నారు. సర్వమానవాళి సన్మార్గంలో నడుచుకోవాలని క్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని తెలిపారు. ప్రభువు సత్యం చెప్పి గాయపడటానికైనా ఇష్టపడతారు తప్ప అబద్ధం చెప్పి సంతోషపరచాలని ఎప్పుడూ చూడలేదని, కల్వరి కొండపై సిలువ మరణం సమయంలోకూడా ఆయన చేసింది అదేనని అన్నారు. సాయంత్రం ఏసుక్రీస్తు పునరుత్థానంపై ప్రదర్శించిన నాటిక, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సహాయక గురువులు ఫాదర్ బాలశౌరి, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.

షాలేము మినిస్ట్రీస్ చర్చిలో..

ఏసు పునరుత్థానం పండుగ సందర్భంగా 38వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోగల షాలేము మినిస్ట్రీస్ చర్చిలో ఫాదర్ పుట్ల సత్యవేదం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ పాల్గొని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభువు మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాదిలి చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం పూర్ణచంద్రరావు, రాచమళ్ల సుధాకర్(సబ్బుల్స్), రుద్రశంకర్, కోట రాంబాబు, దిబ్బ మణిబాబు, ఆర్ విజయ్ స్వామి, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే క్రీస్తు పునరుత్థానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజల కోసమే క్రీస్తు పునరుత్థానుడై వచ్చారని సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ సెంటనరీ చర్చి ఫాదర్ దామల విజయకుమార్ అన్నారు. తారాపేటలోని పురాతన చర్చిగా పిలవబడే సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ సెంటనరీ చర్చి ప్రాంగణంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ కథెడ్రల్ విచారణ కర్త ఫాదర్ విజయకుమార్ తోటి విచారణకర్తలతో కలిసి పాస్కా ఈస్టర్ కొవ్వొత్తిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. నూతనంగా నిర్మాణం చేసిన ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆయన సందేశమిస్తూ క్రీస్తు మరణాన్ని జయించి సజీవుడై వచ్చారన్నారు. మానవుల పాప పరిహార్థం ఏసుక్రీస్తు మరణం పొందారన్నారు. క్రీస్తు మార్గం మానవునికి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. పాప పంకిలంలో కొట్టుమిట్టాడుతున్న అంధకారం నుంచి క్రీస్తు వెలుగును అందిచారని భక్తులకు వివరించారు. పాప విమోచకుడు ఏసుక్రీస్తు అన్నారు. క్రీస్తు రాకతో చరిత్ర ప్రభావితమైందన్నారు.

ఏసుక్రీస్తు శకం, క్రీస్తు పూర్వంగా చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. ఈ లోకంలో అతి పరిశుద్ధునిగా జన్మించిన ఏసుక్రీస్తు మానవ జీవితాలకు మార్గదర్శకునిగా నిలిచారన్నారు. మానవుల పాపాలకు పరిహారంగా ఆయనకు ఆయనే బలియాగమైన తరువాత, మనిషికి పాప విమోచన కలిగి దైవ రాజ్యంలోకి ప్రవేశించటానికి అర్హత పొందారన్నారు. అనంతరం సెయింట్ పీటర్స్ కథెడ్రల్‌లో ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై విజయకుమార్ ఇతర గురువులు ఈస్టర్ సమిష్టి దివ్యపూజ బలి సమర్పించారు. దివ్యపూజ అనంతరం భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. తొలుత పునరుత్థానుడైన క్రీస్తుకు పవిత్ర సాంబ్రాణి దూపం వేయగా భక్తులు క్రీస్తును ఆహ్వానిస్తూ కొవ్వొత్తులు వెలిగించి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి


భూపాల్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కళాకారుల సంక్షేమం కోసం కార్యాచరణ చేసుకోవాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ మహ్మమద్ ఇంతియాజ్ తెలిపారు. మహానటి సావిత్రి సాహిత్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా సామాజిక సేవకుడు పిడికిటి భూపాల్‌కు సినీనటుడు ఎన్టీఆర్ సేవా తపస్వి పురస్కార కార్యక్రమాన్ని అందజేశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ.. గుంటూరులో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో భూపాల్‌తో పరిచయం ఏర్పందని వారు సమాజిక సేవలను ఆనాడే గుర్తించినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా కోవిడ్ సమయంలో ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాల్సిన అవసముందన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి..

శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. సావిత్రి కళాపీఠం స్థాపించి 13 సంవత్సరాలుగా వివిధ రంగాల్లోని ప్రముఖులను గుర్తించి వారికి సేవా పురస్కారాలను ప్రదానం చేస్తున్న కళాపీఠం సేవలను ఇంతియాజ్ అభినందించారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అభినందించారు సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ కలాం యువ ఫౌండేషన్ స్థాపించి నగరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా చేయడానికి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న పిడికిటి భూపాల్‌ను 2022 సంవత్సరానికి గానూ ఎన్టీఆర్ సేవా తపస్వి పురస్కారం ప్రదానం చేశామరు. పురస్కార గ్రహీత భూపాల్ మాట్లాడుతూ.. పర్యావరణానికి ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాల్సిన అవసముందన్నారు. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చావా నరసింహారావు పాల్గొన్నారు. గాయకుడు బాలాజీకుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్రగీతాలను ఆలపించారు.

ఉత్సాహంగా ‘చదవడం మాకిష్టం’


చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులతో పాఠ్య పుస్తకాలతో పాటు నీతికథలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో అందుబాటులో ఉండే నీతి కథలు, సాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు తదితర పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల చేత భగవద్గీత పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సునీత, సిబ్బంది జె.శంకర్, గోపాలరావు, ఫణిబాబు, దుర్గాంబ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి’


వెలంపల్లి సమక్షంలో శివశర్మ పార్టీలో చేరిన ఫొటోను చూపుతున్న నరేంద్ర రాఘవ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ప్రజా క్షేత్రంలోనే తగిన బుద్ధి చెబుతామని కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ హెచ్చరించారు. డివిజన్ టీడీపీ నాయకుడు కప్పగంతు శివ శర్మ వెలంపల్లిపై చేసిన సత్యదూరమైన ఆరోపణలను ఖండించారు. విద్యాధరపురంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో బ్రాహ్మణులకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. దేవదాయ శాఖ నిధులతో ఇక్కడ వేద పాఠశాల నిర్మించిన వెలంపల్లిని విమర్శించే అర్హత లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ తరుపున ఎవరు పోటీ చేస్తారో చెప్పగలవా అని సవాల్ విసిరారు. హిందూ దేవాలయాల గురించి మాట్లాడే శివ శర్మ టీడీపీ హయాంలో ఎన్ని దేవాలయాలను నేలమట్టం చేశారో గుర్తుందా అని ప్రశ్నించారు. కూల్చిన ఆయా దేవాలయాల్లోని దేవతా విగ్రహాలను వీఎంసీ చెత్త ట్రాక్టర్‌లో పడేసి తీసుకువెళ్లిన దుర్ఘటన మరిచి పోయావా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ కూల్చేసిన దేవాలయాలను పునఃనిర్మిస్తామని ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత వెలంపల్లిదేనని చెప్పారు. పార్టీలు మారే రాజకీయ అజ్ఞాని శివ శర్మ అని, అవాకులు చెవాకులు పేలితే తగిన మూల్యం చెల్లించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 2019 ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన శివ శర్మకు పార్టీ కండువా కప్పుతున్న వెలంపల్లి ఫొటోను చూపించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏలూరు వెంకన్న, డీవీ రెడ్డి, అంబటిపూడి శ్రీకాంత్, రుద్రశంకర్ పాల్గొన్నారు.

‘గుండెపోటు ఆకస్మికంగా రాదు’



పటమట(విజయవాడతూర్పు): గుండెపోటు ఆకస్మికంగా అప్పటికప్పుడు రాదని ప్రముఖ వైద్య నిపుణుడు రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. రమేష్ హాస్పిటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజ్ వివాంతా హోటల్‌లో వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటుకు కొన్ని సంవత్సరాలకు ముందే బీజం పడుతుందని, అది క్రమేపీ పెరిగి ఆకస్మికంగా గుండెపోటు సంభవిస్తుందని దాన్ని ముందుగానే కనుగొనే బాధ్యత ఫ్యామిలీ డాక్టర్లు, కార్డియాలజిస్టులపై ఉందన్నారు. అకస్మాత్తుగా సంభవించే గుండెపోటు మరణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గుండెపోటుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ భాగస్వామ్య సంస్థ ఆస్టర్ డీఎం హెల్త్ కేర్ ఇండియా హెడ్ డాక్టర్ నితీష్ షెట్టి, ఏపీ సీఈఓ దేవానంద్, రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామ్మోహనరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెహమాన్, సెక్రెటరీ డాక్టర్ దుర్గారాణి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సూరపనేని సుధాకర్, డాక్టర్ గుడారు జగదీష్ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

విజయవాడ,
తేది:08.04.2023.

ఉప్పలూరి ప్రకాశం, అడ్వకేటు,
27-20-45, మ్యూజియం రోడ్డు, విజయవాడ-2.